క్లుప్తంగా

రాములోరి తలంబ్రాలు పంపిణీ



ఆత్మకూర్/అమరచింత: భద్రాచలం సీతారాముల వారి కల్యాణానికి సంబంధించిన తలంబ్రాలను శ్రీవాసవి సేవాసమితి వ్యవస్థాపకుడు పూరి సురేష్ ఆధ్వర్యంలో ఆత్మకూర్, అమరచింత పట్టణాల్లోని వాసవీ మహిళా సంఘం సభ్యులకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి జిల్లా అధ్యక్షురాలు శ్రావణి, అన్నపూర్ణ, ఉమాదేవి, జయశ్రీ, భార్గవి, విజయలక్ష్మి, కవిత, అర్చన, సరళ, మాధవి, ఉమ, బాలకిష్టమ్మ ఉన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

పాన్‌గల్: వేసవి పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించినట్లు ఏఓ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో రైతులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో వేసవిలో సాగు చేసే పంటలు, నీటి యాజమాన్యం, విత్తనోత్పత్తి, మొక్కల సాంద్రతతో కూరగాయల సాగులో చేపట్టాల్సిన ప్రత్యేక యాజమాన్య పద్ధతుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించినట్లు ఏఓ పేర్కొన్నారు.

ఛత్రపతి శంభాజీకి ఘన నివాళి



అమరచింత: ఛత్రపతి శంభాజీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని హిందూ యువకులు ఛత్రపతి చౌరస్తాలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం శంభాజీ మహారాజ్ చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, స్వాగత్, అజంతా వెంకటేష్, రాజేష్, హరి, వంశీ, భాగ్యరాజ్, నాగరాజ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

565 మందికి మధుమేహ పరీక్షలు

పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాధరావుపల్లి, గన్యానాయక్‌తండాలో ఏఎన్‌ఎం సుమిత్ర పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏళ్లు దాటినవారందరూ పరీక్షలు చేయించుకొని వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో సిబ్బంది 565 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు.

బీజేపీ రాష్ట్ర కోశాధికారికి పరామర్శ



ఖిల్లాఘనపురం: బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్‌ను మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, జిల్లా సంస్థాగత కార్యదర్శి కూతురి బుడ్డన్న, ఖిల్లాఘనపురం మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు పరామర్శించారు. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచు బండారి లక్ష్మయ్య ఈ నెల 9న మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వారు ఆయన కుమారుడు బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ ఇంటికి చేరుకుని మాజీ సర్పంచ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దశరథ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం మండల విద్యాధికారి జయశంకర్ పర్యటించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మండలంలోని మానాజీపేట, హరిజవాడ ప్రాథమిక పాఠశాల, ఖిల్లాఘనపురం ప్రాథమిక పాఠశాల, మల్కాపురం ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించిన ఆయన రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ నుంచి డీఈడీ శిక్షణ ఉపాధ్యాయులను పాఠశాలకు ఒక్కరి చొప్పున పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. మూడు రోజులుగా నిర్వహించే ఈ కార్యక్రమం బుధవారంతో అన్ని పాఠశాలల్లో పూర్తి చేస్తామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ఆత్మకూర్‌లో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఇదివరకే రూ.300 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను టీపీసీసీ కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి అందజేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది పనిగట్టుకుని అడ్డంకులను సృష్టిస్తున్నారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా చెప్పింది చేస్తామన్నారు. సోషల్ మీడియాలో ప్రతిపక్షాలకు చెందిన కొంతమంది తప్పుడు మెసేజ్‌లు పోస్ట్‌చేస్తు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్ శ్రేణులు ఎప్పటికప్పుడు కౌంటర్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ శ్రీపాద్, నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను ఉన్నారు.

రైతు ప్రయోజనాలను కాపాడటమే..

అమరచింత: సకాలంలో సాగునీరు ఇస్తూ పంటలను కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళ్తూ సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని చంద్రగఢ్ ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం సందర్శించి సాగునీటి పంపింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.26 లక్షల నిధులు మంజూరు చేసి కాలిపోయిన స్టాటర్‌కు మరమ్మతు చేయించామన్నారు. చంద్రగఢ్ ఎత్తిపోతల పథకానికి సంబంధిచి రూ.8 కోట్ల ప్రతిపాదనలతో మరమ్మతులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

మండలంలోని మస్తీపురం గ్రామంలో రూ.67 లక్షలతో నిర్మించే సీసీ రహదారి పనులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి భూమిపూజ నిర్వహించి, పనులు ప్రారంభించారు. త్వరితంగా పనులు చేపట్టి జూరాల ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులతో పాటు గద్వాల మీదుగా కర్ణాటక రాష్ట్రానికి వెళ్తున్న ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలన్నారు.

చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం 47 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, తహసీల్దార్ రవియాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తౌఫిక్ ఉన్నారు.

‘పనుల్లో జాప్యం ఉండొద్దు’



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: జిల్లాలో ప్రభుత్వం ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా పరిషత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ భవనాలు, పాఠశాలల నిర్మాణం, మరమ్మతులు, అంగన్‌వాడీ భవనాల్లో మౌలిక సదుపాయాలు తదితర పనుల పురోగతి గురించి చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు కనీసం రూ.15 నుంచి 16 కోట్లకు సంబంధించిన పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని ఇంజినీరింగ్ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించారు. అనంతరం పీఎంశ్రీ నిధులతో జిల్లాలోని కేజీబీవీ సంక్షేమ పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతులు, మౌలిక సదుపాయాల పనులపై సమీక్ష నిర్వహించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జ్ యాదయ్య, పీడీ ఆర్డీఓ ఉమాదేవి, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, విద్యాశాఖ అధికారి, సహాయ ఇంజినీర్లు పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రి నిర్మించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ పట్టణ నాయకులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టణ బీజేపీ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొమ్ము భరత్ భూషణ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పట్టణానికి 30 పడకల ఆస్పత్రి కోసం 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.5.75 కోట్లు మంజూరు చేసిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నాటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా తన్నీరుహరీష్ రావు పట్టణంలో 30 పడకల ఆస్పత్రికి భూమిపూజ చేశారని గుర్తుచేశారు. భూమిపూజ జరిగి ఏడాదిన్నర గడుస్తున్నా పనులు ప్రారంభించలేదని వాపోయారు. ఆస్పత్రి పనులను తక్షణమే ప్రారంభించాలనే భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శిలాఫలకం శంకుస్థాపన వద్ద నిరసన దీక్ష చేపట్టి, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, బాలస్వామి, ఆవుల రాఘవేందర్ గౌడ్, మహేష్, రాఘవేందర్ రెడ్డి, బాలకృష్ణ, వెంకటేష్, రమేష్, నాగరాజు, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఆత్మకూర్: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవరపల్లి గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.1.20 లక్షలను పోగు చేసి సీఐ, ఎస్‌ఐ కి అందజేశారు. అనంతరం రేచింతల గ్రామస్తులు రూ.70 వేలు, కత్తేపల్లి గ్రామస్తులు రూ.30 వేలు సమకూర్చి ఎస్‌ఐ కి అందజేసారు. కార్యక్రమంలో మణ్యం, కావలిస్వామి, గ్రామ పోలీస్ అధికారి భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మునగాల కృష్ణ



నియామక పత్రం అందుకుంటున్న కృష్ణ

కొత్తకోట: మండలంలోని వడ్డెవాట గ్రామానికి చెందిన మునగాల కృష్ణ వనపర్తి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా కోర్టులో న్యాయ సేవలు అందిస్తూ.. బార్ అసోసియేషన్‌లో రెండుసార్లు లైబ్రరీ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తించిన కృష్ణ తనదైన ముద్ర వేసుకున్నారు. వనపర్తి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా లా సెక్రెటరీ ద్వారా జారీ చేయబడిన నియామకపత్రాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మునగాల కృష్ణ మాట్లాడుతూ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం కు ధన్యవాదాలు తెలిపారు.

2 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గోపాల్‌పేట: రేవల్లి మండలంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశామని రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొల్లాపూర్ మండలం నుంచి గుడిపల్లి గ్రామానికి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా మంగళవారం బండరావిపాకుల చౌరస్తా వద్ద ఒకటి, నాగపూర్ చౌరస్తా వద్ద మరో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఇసుక ట్రాక్టర్లను ఆపి అనుమతి పత్రాలు ఉన్నాయా.. అని అడుగగా ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రైస్ మిల్లుల్లో సీసీ కెమెరాలు, మోటార్ల చోరీ

పాన్‌గల్: రైస్ మిల్లుల్లో సీసీ కెమెరాలు, విద్యుత్ మోటర్లు, ఇన్వెర్టర్ బ్యాటరీల చోరీపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన పుచ్చల పరమేశ్వర్‌రెడ్డికి చెందిన మీనాక్షి ఫుడ్ ప్రొడక్ట్స్, ఈషాన్ ఆగ్రోటెక్ అనే రెండు రైస్ మిల్లుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 2వ తేదీన ఆ రెండు రైస్ మిల్లులను యజమాని సందర్శించి హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం హైదరాబాదు నుంచి వచ్చి రైస్ మిల్లుల వద్దకు వెళ్లి చూడగా.. సీసీ కెమెరాలు, మిల్లుల్లో లోపల ఉన్న 9 విద్యుత్ మోటార్లు, ఇన్వెర్టర్ బ్యాటరీ, మరికొన్ని విలువైన వస్తువులు కనిపించలేదు. దీంతో మంగళవారం మిల్లుల్లో సీసీ కెమెరాలు, మోటార్లు, ఇన్వెర్టర్, విలువైన వస్తు వులు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు మిల్లు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రపంచ శాంతి కోసమే ప్రార్థనలు

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసం మొదటి దశకం పూర్తయిన సందర్భంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు స్థానిక ఇమాదుల్ ఉలూమ్ మదర్సా మసీదులో ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసంలోని తరావిహ్ నమాజ్ ముఖ్యమైనది, ప్రతి రోజు రాత్రి ఇషా నమాజ్ తర్వాత చదివే తరావిహ్ నమాజ్‌లో దివ్య ఖురాన్ పఠిస్తారు. ఈ సందర్భంగా హాఫీజే ఖురాన్‌లకు స్థానికులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హాఫీజ్ సాబ్‌లు జియావూర్ రహెమాన్, ఉబేదుర్‌రహ్మాన్, ముక్తదీర్, రఫీయోద్దీన్, అబ్దుల్‌ఆలీం, ఇర్ఫాన్, షబ్బీర్, ఫకురుద్దీన్, ఆమీర్ ను పూల మాలలు, మహెరుమాలతో సన్మానించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, హనీఫ్, ఇస్మాయిల్, సాదిఖ్, ఫేరోజ్, మహమ్మద్‌రఫీ, ఖుద్దూస్, వాహీద్, ఖాదర్, అఫ్రోజ్, ఇమ్రాన్, జుబేర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరవధిక దీక్షలు



రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వనపర్తిటౌన్: ప్రభుత్వం ఇక నుంచి భర్తీ చేసే ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు, నియమాకాల్లో ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని చేపట్టిన నిరవధిక దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో వీరపోగు గోవింద్, మంద నరసింహ, గంధం గట్టయ్య, మన్యం, బండారు రాజు, గోవర్ధన్, సుధాకర్, కుర్మయ్య, నాగేషు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి

గోపాల్‌పేట: అధికారులంతా సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఏదుల ఎంపీడీఓ రాములు అన్నారు. మంగళవారం మండలంలోని మాచుపల్లి, గుండెవాల్యాతండాలో ఆయన పర్యటించారు. పాఠశాలలు, నర్సరీలు, అంగన్‌వాడీ సెంటర్లు, గ్రామ పంచాయతీలను పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి పాఠశాలలకు హాజరుకావాలని సూచించారు. నర్సరీల్లో ఎండిపోయిన మొక్కలను ఎప్పటికప్పుడు మార్చి కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు గుడ్లు, బాలామృతం ఎప్పటికప్పుడు ఇవ్వాలని చెప్పారు. గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడుతూ పన్ను వసూళ్లు, ఇతర పనులు ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు.

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసునమోదు

ఖిల్లాఘనపురం: పెళ్లి వేడుకలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటనాగరాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలం అప్పారెడ్డిపల్లిలో ఈ నెల 9న ఓ పెళ్లిలో సాంప్రదాయం ప్రకారం సాక పోసేందుకు పానుగంటి శేఖర్ కులస్తులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో శేఖర్‌కు, ఆయన తమ్ముడు పానుగంటి బంగారు కు గొడవ జరిగింది. ఈ సమయంలో బంగారు కోపంతో శేఖర్‌ను కర్రతో కొట్టడంతో కుడి కన్ను వద్ద గాయమైంది. మరుసటి రోజు అదే గ్రామానికి చెందిన కాశీపురం జగన్, పానుగంటి అంజనేయులు శేఖర్ దగ్గరకు వచ్చి బంగారుతో గొడవ పెట్టుకుంటావా అని బెదిరించి కొట్టారు. ఈ విషయమై మంగళవారం బాధితుడు పానుగంటి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటనాగరాజు తెలిపారు.

కిరాణ దుకాణం ధ్వంసం చేసిన ఘటనలో..

కిరాణ దుకాణం ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన ఖిల్లాఘనపురంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పంతగాని లక్ష్మి తన తండ్రిగారు విరజగాని బాలయ్య ఇంటి స్థలంలో కిరాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తోంది. అదేగ్రామానికి చెందిన విరజగాని రాములు, విరజగాని మహేష్ గొడవ పెట్టుకొని దుకాణాన్ని ధ్వంసం చేశారు. ప్రశ్నించిన లక్ష్మి, నచ్చజెప్పడానికి వెళ్లిన ఆమె అక్క నాగమ్మ పై వారు దాడి చేశారు. ఈ విషయమై లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బి. శ్రీనివాసులు తెలిపారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



పెద్దమందడిలో అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఐ అధికారులు

కొత్తకోట రూరల్: సామాజిక భద్రత, బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ అధికారులు మణికంఠ, అజయ్, హర్షవర్ధన్ అన్నారు. మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలో ఆర్బీఐ, ఏపీజీవీబీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు, ఖాతాదారులకు ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ అధికారులు మాట్లాడుతూ బ్యాంకు అందించే వివిధ రకాల సేవల గురించి వివరించారు. మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, లావాదేవీల గురించి వివరించడంతో పాటు ఏటీఎం రూపే కార్డులను వాడి సమయాన్ని ఎలా ఆదా చేసుకోవాలో సూచించారు. మోసపూరిత కాల్స్ వస్తే నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. ఒకవేళ మోసపోతే వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సామాజిక భద్రత పథకాలు అయిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, బీమా యోజన, బీమా సంరక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో టీజీబీ మేనేజర్ జ్ఞానేశ్వర్‌గౌడ్, రీజినల్ ఆఫీసర్ స్వామి, జిల్లా అరుణ్, క్రాంతి, దక్షిణ, రెడ్డి మహిళా సమాఖ్య ఏపీఎం నాగమణి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఆన్‌లైన్ చెల్లింపులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని భారతీయ రిజర్వ్ బ్యాంకు అఫిషియల్ మణికంఠ, అజయ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఏపీజీవీబీ మేనేజర్ శ్రీనివాసులుతో కలిసి స్థానిక ట్రైనిటోయిస్ పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్, ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసపూరిత కాల్స్ వస్తే వెంటనే ఫోన్ కట్ చేయాలని, తెలియని లింకులను ఓపెన్ చేసి ఇబ్బందులకు గురికావద్దని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం అనుబంధ సంఘం నాయకులు

అమరచింత: ధర్మాపురం గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా నాయకులు వెంకటేష్, అజయ్ మాట్లాడుతూ మంజూరైన బీటీ రహదారిని నేటికీ నిర్మించకపోవడం వింతగా ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు అత్యధికంగా నిధులు కేటాయించి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలను చేస్తుందే తప్పా వాటిని ఆచరించడం లేదన్నారు. వారం రోజుల కిందట గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి అధికారులకు నివేదించామన్నారు. సమస్యల పరిష్కారం కోసం పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ధర్నా చేస్తున్నామని తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. సీసీ రహదారులు లేకపోవడంతో అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ ఏర్పడి ఐదేళ్లు అవుతున్నా జీపీ భవనానికి సొంత భవనం లేకపోవడం శోచనీయం అన్నారు. లో ఓల్టేజీ సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందించారు. కార్యక్రమంలో సీపీఎం శంకర్‌రాజు, మోహన్, మన్యం, బాలు, రాములు,మాసన్న, చంద్రాయుడు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార ప్లాట్లపై చర్యలు తప్పవు

వనపర్తిటౌన్/కొత్తకోట/ఆత్మకూర్/అమరచింత: కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు అక్రమ వెంచర్లలో హద్దురాళ్లను మున్సిపల్ అధికారులు తొలగించారు. 2020 ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకొని పూర్తిగా పేమెంట్ చెల్లించకుండా, అధికారులు ఫోన్లు చేసినా స్పందించకపోవడంతో నాగవరం, సూర్యచంద్ర స్కూల్ రోడ్డులోని వెంచర్లలో ప్లాట్ల రాళ్ల హద్దులను జేసీబీ సాయంతో తొలగించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, లేదంటే నిబంధనల ప్రకారం ముందుకెళ్తామని టీపీఎస్ మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సుమన్ ఉన్నారు.

కొత్తకోటలో..

కచ్చ లే అవుట్లు, ఎల్‌ఆర్‌ఎస్ చేయని ప్లాట్లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించడంతో మున్సిపల్ కమిషనర్ సైదయ్య వేగం పెంచారు. కలెక్టర్ ఆదేశానుసారం పట్టణ సమీపంలో గల కచ్చ ప్లాట్లలోని హద్దు రాళ్లను ట్రాక్టర్ సాయంతో మున్సిపాల్ సిబ్బంది తొలగించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూపంలో ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు వసూలయ్యాయని తెలిపారు. మార్చి 31 నాటికి 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోవాలని, లేకుంటే ఇల్లు కట్టుకోవాలనుకుంటే ఎలాంటి రాయితీ లేకుండా ప్రస్తుత మార్కెట్ విలువకు 14శాతం పెనాల్టీతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని, మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు.

ఆత్మకూర్‌లో..

మున్సిపాలిటీ పరిధిలోని అనుమతులు లేని వెంచర్లలో కమిషనర్ చికినె శశిధర్ ఆధ్వర్యంలో సిబ్బంది హద్దురాళ్లను తొలగించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ లేదా 95026 39749 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అమరచింతలో..

అక్రమంగా లేఅవుట్లను సిద్ధం చేసుకుని ఎల్‌ఆర్‌ఎస్ తీసుకోకుండా కాలయాపన చేస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రవిబాబు అన్నారు. పట్టణంలోని కాడిగి గణేష్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన రాళ్లను జేసీబీ సాయంతో తొలగించామన్నారు.



కొత్తకోట శివారులో ప్లాట్ల హద్దు రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



వనపర్తిలో..



అమరచింతలో..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాకు చెందిన సఖీబాయికు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం తండా కాంగ్రెస్ నాయకులు రేక్యానాయక్, ప్రేమ్‌నాయక్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, కృషి చేసిన మండల నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, తండావాసులు పాల్గొన్నారు.